# "లిటిగేషన్"

"సే కోర్టస్ !" అంటూ గిరీశంగారు అందించినప్పటికీ, 'దేవుడు సృజించిన ప్రపంచములో యేమి వస్తువులున్నవి ?' అనే ప్రశ్నకు, వెనకటికి పరధ్యానంలోపడ్డ వెంకటేశం "వేధవలు !" అనేశాడు. వెధవల్ అన్నది లాటిన్ మాటనీ, ఆ మాట కర్థం కచేరీ యనీ తరవాత గిరీశంగారు సమర్థించుకున్నా రనుకోండీ – పోతే, లిటిగేషనంటే ఒక్క కోర్టులలో వచ్చే తగాదాలే కాకపో వచ్చు. పెద్ద లిటిగేషనులో పడ్డానంటే, పెద్ద ఇబ్బందిలో పడ్డాననికూడా అర్థం చెప్పుకోవచ్చు.

వ్యవహారమైతే కోర్టుకి – లేదా కోర్టులో తీర్పుకొచ్చిన గొడవకి సంబంధించినదే – ఐనా, జూరీ పెద్దగా వ్యవహరించటమే సాంప్రదాయంగా ఉన్న సంశయాల్రావు, గొప్ప లిటిగేషనులోనే పడ్డాడు.

క్రిమినల్ కేసు, జడ్జీగారు వినడం పూర్తయింది. జూరీ అభిప్రాయం అడిగారు. జూరీ సభ్యులు వేరే గదిలోకి పోయి తలుపులు బిడాయించుకున్నారు.

అరగంట గడిచింది. సంశయాల్రావు, బయట కొచ్చాడు.

"మీ నిర్ణయం ఏమిటో చెప్పండి !" అన్నారు జడ్జీగారు.

సంశయాల్రావు ఒకసారి గొంతు సరిచేసుకున్నాడు.

"వాది చెప్పిందీ, వాది తరపు న్యాయవాదిగారు చెప్పిందీ విన్నాక ఏమనిపిస్తున్నదంటే, వాదిగారి కథనమే సరియైన దనిపిస్తున్నది, యువరానర్ ! అయితే, ప్రతివాదులు చెప్పిందీ, ప్రతివాదుల తరపు న్యాయవాదులు చెప్పిందీ కూడా వినేశాం గనక, ఏమనిపిస్తున్నదంటే, ప్రతివాదులు చెప్పిందే రైటనిపిస్తున్నది యువరానర్ !" అన్నాడు సంశయాల్రావు.

వాది ప్రతివాదుల న్యాయవాదులంతా ఒకే మోస్తరుగా చకితులైనారు.

జడ్జీగారు తమ సందేహాన్ని సలహా రూపంలో బయటపెట్టాడు.

"మీ రిచ్చే తీర్పులో నేను జోక్యం కలిగించుకోకూడదనే అనుకోండీ. అయినా, తెలీకడుగుతాను – మన్లో మాట. ఉభయపక్షాలవారూ రైటే అంటున్నారు కదా మీరు, అదెట్లా సాధ్యం, మిస్టర్ సంశయాల్రావ్ ?"

సంశయాల్రావు మరో పొడిదగ్గు దగ్గేశాడు.

"యువరానర్ ! ఇప్పుడేమనిపిస్తున్నదంటే, మీరే రైటని, పూర్తిగా నమ్మకం కలుగుతున్నది – యువరానర్ !" అనేశాడు సంశయాల్రావు.

"బెనిఫిట్ ఆఫ్ డౌట్ !" అనేస్తూ, ఒక నిట్టూర్పు విడిచారు జడ్జీగారుని.

'శేఖర్'